క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మునిపల్లిలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ఆసుపత్రి ఖర్చులను తగ్గించుకోవాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని మునిపల్లి పంచాయితీ పరిధిలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.నాగవేణి, డి.మంగాదేవి, ఎ.సునీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

రంగంపేట: మండలంలో శుక్రవారం నుంచి రెండో దశ జగనన్న ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం చంద్రేడు సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభిస్తామన్నారు. శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు జనరల్ ఓపీ వైద్యులు, కంటి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఐగా ఎంపికైన శ్రీలతకు సత్కారం



శ్రీలతను సత్కరిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు, ఎంపీడీవో గౌరీకుమారి తదితరులు

ఉప్పలగుప్తం: స్థానిక సచివాలయం-2లో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న కుంచే శ్రీలత ఇటీవల ఎస్ఐ పరీక్షలో ఉత్తీర్ణత సాధించటంతో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు దుశ్శాలువా కప్పి అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



నవోదయ ఎంట్రన్స్ మెటీరియల్‌తో విద్యార్థులు

యానాం: నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీన జరగనున్న పరీక్షకు సిద్ధపడుతున్న వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు స్టడీ మెటీరియల్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష విధివిధానాలపై అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్టడీ మెటీరియల్‌లో అందజేస్తున్న ప్రాక్టీస్ పేపర్ల ద్వారా అందరూ పరీక్షకు సిద్ధపడి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అయోధ్య అక్షతల పంపిణీ



గొల్లవిల్లిలో అయోధ్య అక్షతలను పంపిణీ చేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ఉప్పలగుప్తం: మండల బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గొల్లవిల్లి గ్రామంలో అయోధ్య అక్షతల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీరామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన పరిచి గడప గడపకూ అయోధ్య అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శిరంగు నాయుడు, అరిగెల నానాజీ, సలాది శివాజీ, యెరుబండి భద్రం, పైబోడి వీరేంద్ర, మద్దింశెట్టి ప్రసాద్, పేరాబత్తుల రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్క్‌షాప్

తాళ్లరేవు: తీర ప్రాంతంలో సంచరించే వివిధ రకాల పక్షులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వలస పక్షుల గణన కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏసియన్ వాటర్ బర్డ్ సెన్సస్- 2024 కోసం ముందుగా మండలంలోని కోరంగి ఫారెస్ట్ బయోడైవర్సిటీ సెంటర్‌లో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి నేతృత్వంలో నీటి పక్షుల గణన ఏ విధంగా చేపట్టాలి, పక్షుల గణన ప్రాముఖ్యతలను వివరించనున్నారు. వర్క్‌షాప్ అనంతరం శనివారం నుంచి 60 మంది సభ్యులు బృందాలుగా ఏర్పడి పక్షుల గణనలో పాల్గొంటారని అటవీ అధికారులు చెబుతున్నారు.

నిత్య కల్యాణం.. పచ్చ తోరణం..

- దినదినాభివృద్ధి చెందుతున్న మురమళ్ల వీరేశ్వరుని ఆలయం
- నాలుగేళ్లుగా మౌలిక వసతుల మెరుగు
- రూ.2 కోట్ల ఖర్చుతో శాశ్వత కట్టడాలు



నూతనంగా నిర్మించిన మండపంలో కల్యాణం చేయించుకుంటున్న భక్తులు

ఐ.పోలవరం: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. గత 20 ఏళ్లలో జరిగిన అభివృద్ధి ఒక ఎత్తు అయితే గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి మరొక ఎత్తు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులను మెరుగుపరచడంతో దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్య అధికమవ్వడమే కాకుండా రోజువారీ నిత్య కల్యాణాల సంఖ్య సైతం పెరిగింది. భక్తుల కోసం వసతులు మెరుగు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

పెరిగిన నిత్య కల్యాణాలు

గత నాలుగేళ్లలో ఆలయంలో సుమారు రూ.2 కోట్ల ఖర్చుతో శాశ్వత కట్టడాలు నిర్మించారు. కొత్తగా అభిషేక మండపాన్ని రూ.18 లక్షలతో నిర్మించారు. నిత్య కల్యాణం జరిగే మండపాన్ని రూ.80 లక్షలతో నిర్మించారు. దీంతో పాటుగా కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం తినేందుకు వీలుగా నూతనంగా అన్నదాన సత్రాన్ని రూ.60 లక్షలతో నిర్మిస్తున్నారు. వచ్చే సంక్రాంతి నాటికి ఇది ప్రారంభం కానుంది. ఇవే కాకుండా లక్షలాది రూపాయిలతో మరింత అభివృద్ధి పనులు జరిగాయి. ఈ సౌకర్యాల కల్పనతో వందలాదిగా వస్తున్న భక్తులకు మెరుగైన వసతులు ఏర్పడినట్టైంది. అభిషేక మండపం, నిత్య కల్యాణం జరిగే మండపాలు కొత్తవి కట్టడం వల్ల భక్తులు సౌకర్యవంతంగా కూర్చుని పూజలు, కల్యాణాలు చేసుకుంటున్నారు. నిత్యాన్నదానం మొదలై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ సరైన వసతులు లేక భక్తులు నిలబడి బఫే పద్ధతిలో భోజనం చేసేవారు. కొత్త అన్నదాన భవనం పూర్తయితే ఆ పరిస్థితి ఉండదు. వసతులు పెరగడంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. గతంలో సగటున రోజుకు 81 వరకూ ఉండే కల్యాణాల సంఖ్య నూతన కల్యాణ మండపం నిర్మించిన తరువాత 116 వరకూ పెరిగింది. అంతే కాక ఆలయ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలం 0.25 సెంట్లు భూమిని అభివృద్ధి చేసి గోశాల ఏర్పాటు చేశారు. భక్తులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. కల్యాణం చేయించుకునే భక్తుల కోసం లాకర్ల సదుపాయం, కల్యాణం అనంతరం భక్తులకు మార్కెట్ సెంటర్ వరకూ ఉచిత ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు, భక్తుల సహకారంతో కల్యాణ సింహాసనానికి రూ.15 లక్షలతో



నూతనంగా నిర్మించిన అభిషేక మండపం

వెండి తొడుగు చేయించారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తన సొంత సొమ్ముతో రథం బహూకరించడంతో పాటు ఆలయ ఆవరణలో భారీ రేకు షెడ్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. వీరేశ్వరస్వామి ఆలయానికి ఆదాయం బాగా వస్తుండడంతో కార్యనిర్వాహణాధికారి స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయికి ఎదిగింది.

భక్తులకు మెరుగైన సేవలు



వీరేశ్వరస్వామి ఆలయాన్ని నా హయాంలో అభివృద్ధి చేయడం దేవుడు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఆలయంలో అభిషేక మండపం, కల్యాణ మండపం, అన్నదాన సత్రం తదితర శాశ్వత కట్టడాల నిర్మాణం పూర్తయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైంది.

– పెన్మత్స కామరాజు, దేవస్థానం చైర్మన్

హిందూ ధర్మ ప్రచారానికి అధిక ప్రాధాన్యం



దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచారానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. ఆలయంలో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఆలయానికి గణనీయంగా ఆదాయం పెరగడంతో అసిస్టెంట్ కమిషనర్ స్థాయికి ఎదిగింది.

– మాచిరాజు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహణాధికారి

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయండి



ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. కోడూరుపాడు సచివాలయం పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు. కోడూరుపాడు గ్రామానికి 804 కార్డులు మంజూరైతే 609 కార్డులను పంపిణీ చేశారని, మిగిలిన కార్డులను గురువారం సాయంత్రానికి పంపిణీ చేసేయాలని వలంటీర్లు, ఏఎన్ఎంలను ఆదేశించారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చిక్కం శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను కలిసిన సంచార జాతుల చైర్మన్ వీరన్న



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరన్న

అల్లవరం: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసంలో ఏపీ సంచార జాతుల చైర్మన్ పెంట్ర వీరన్న గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దళితులు, బడుగు బలహీన వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉండాలని ఎమ్మెల్సీ అన్నారు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని, వారి మాటలను నమ్మవద్దని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సూచించారు. కార్యక్రమంలో వంగలపూడి యేసయ్య, ముసునూరి సోమరాజు, సిర్రా చంద్రబాబు పాల్గొన్నారు.

రెండు పాముల పట్టివేత



గరువుపేటలో పాములను పట్టుకున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

కాట్రేనికోన: మండలంలోని గరువుపేట పంట బోదె వద్ద రెండు పాములు సంచరిస్తుండడంతో రైతులు గుర్తించి స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించారు. ఆయన హుటాహుటీన అక్కడకు చేరుకుని పాములను పట్టుకుని బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ కుటుంబానికి వితరణ



హరినాథ్ కుటుంబానికి సాయం అందిస్తున్న సంఘం నాయకులు

అమలాపురం రూరల్: విద్యుదాఘాతంతో చనిపోయిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు చప్పిడి హరినాథ్ కుటుంబానికి మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.20 వేల నగదు, నిత్యావసర సరకులను గురువారం అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు గాలి దేవర వెంకటరమణమూర్తి, ప్రధాన కార్యదర్శి తొత్తరమూడి శ్రీనివాసరావు, కోశాధికారి దొమ్మేటి స్వామి, మట్టపర్తి సత్తిబాబు, అనిపిండి కామేశ్వరరావు, రమణాతి వెంకటరమణల చేతుల మీదుగా సాయం చేశారు.

నేడు పీటీఎం ట్రస్టు వార్షికోత్సవం

ఐ.పోలవరం: స్థానిక పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్(పీటీఎం) ట్రస్టు 16వ వార్షికోత్సవం శుక్రవారం జరగనుందని సంస్థ వ్యవస్థాపకుడు పుల్లెపు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణి రావి బేబి సత్యవాణి, తొలి తెలుగు కలర్ సినిమా లవకుశ నటుడు నాగసుబ్రహ్మణ్యం, ఎం.బాలార్జున సత్యనారాయణలకు జాతీయ అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వస్తున్న కవులు, కళాకారులను సత్కరించనున్నామని చెప్పారు.

27 ఫైళ్లకు ఎల్జీ ఆమోదం

యానాం: వివిధ శాఖలకు చెందిన 27 ఫైళ్లకు ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఆమోదం తెలిపారు. ప్రధానంగా పుదుచ్చేరి వ్యాప్తంగా 10 వేల ఉద్యోగాల భర్తీ, వివిధ శాఖల్లో ఉద్యోగులకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు తదితర ఫైళ్లను ఆమె ఆమోదించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, రమణారావు

అమలాపురం టౌన్: సుమారు 3 వేల మంది పదో తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైంది. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచే రమణరావులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయకుమారి, ఎంఈవోలు గుబ్బల సూర్య ప్రకాశం, కె.కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యాత్ర



హెల్త్ కార్డులను అందజేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు

అల్లవరం: మండలంలోని ఎంట్రుకోనలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. నోడల్ అధికారి, ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ఎవరికైనా వర్తించకపోతే సచివాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2047 నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్, కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, సీజీజీబీ మేనేజర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి వార్షిక అనఘావ్రతం



ప్రత్యేక అలంకరణలో కొత్తపేట దత్తాత్రేయ మందిరం

కొత్తపేట: కోనసీమ షిర్డీగా పేరుగాంచిన స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న గురుదత్తాత్రేయస్వామివారి వార్షిక అనఘావ్రత కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా అష్టమి తిథి రోజున సాధారణ అనఘావ్రతం, మార్గశిర మాసంలో అష్టమి నాడు వార్షిక అనఘావ్రతం ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు గోవిందవఝ్జల నరసింహశర్మ, బోడిపాలెం విజయ కనకదుర్గాదేవి, అభయాంజనేయ స్వామివారి ఆలయాల ప్రధానార్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు ఉదయం నుంచి వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, గోపూజ, దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, కలశపూజ జరిపారు. అనంతరం ప్రసాద వితరణ, పూజలో పాల్గొన్న భక్తులకు షిర్డీసాయిబాబా, దత్తాత్రేయస్వామి చిత్రపటాలు, హాట్ క్యారియర్ కానుకగా పంపిణీ చేశారు. అనంతరం భారీఎత్తున అన్న సమారాధన జరిగింది.

పండగ బహుమతి ఉన్నట్టా లేనట్టా..?

యానాం: సంక్రాంతి పండగకు పది రోజులే ఉన్నా పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో ఏటా ఇచ్చే పండగ బహుమతిపై గురువారం వరకూ ప్రభుత్వం ఏ ప్రకటన చేయకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం పండగ బహుమతి ప్రకటిస్తే సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా వస్తువులను కొనుగోలు చేసి రేషన్ కార్డుదారులకు అందజేయాల్సి ఉంటుంది. అయితే దీనికి ముందుగా టెండర్ పిలవాల్సిన ప్రక్రియ సైతం ఉంటుంది. అయితే ప్రకటన లేని నేపథ్యంలో ఈ ఏడాది పండగ బహుమతి ఉన్నట్టా లేనట్టా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తక్కువ సమయంలో కొనుగోళ్లు అసాధ్యం కనుక నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము వేస్తారన్న చర్చ సైతం సాగుతుంది. యానాంలో 16046 కార్డులు, పుదుచ్చేరిలో 2,67,005 కార్డులు, కారైకల్‌లో 61,664 కార్డులు, మాహేలో 8,534 కార్డులకు పండగ బహుమతి ఇవ్వడానికి ఒక్కో కార్డుకి రూ.500 చొప్పున రూ.17.66 కోట్లు అవసరమని ఆర్థిక శాఖ అంచనా వేస్తుంది.

మండల విజిలెన్స్ కమిటీలు నియమించాలి



జేసీ నుపూర్ అజయ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కోనసీమ వినియోగదారుల సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్: జిల్లాలో మండల విజిలెన్స్ కమిటీల నియామకానికి తహసీల్దార్లకు అనుమతి ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌ను అంబేడ్కర్ కోనసీమ వినియోగదారుల సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. జేసీని కలిసినవారిలో కోనసీమ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, కోశాధికారి గోనె మడతల రవికుమార్, ఉపాధ్యక్షుడు బొల్లాప్రగడ నారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు పెంటపాటి సత్యసుబ్రహ్మణ్య గురవయ్య, అరిగెలతేజ వెంకటేష్, గ్రంధి సూర్యనారాయణగుప్తా తదితరులున్నారు.

పరీక్షలపై విద్యార్థులకు భయాందోళన వద్దు



సదస్సులో మాట్లాడుతున్న పీడీ జ్యోతిలక్ష్మీదేవి

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎదుర్కొనే విద్యార్థులు భయాందోళనకు గురికావద్దని ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి అన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించడంపై గురువారం ప్రేరణ అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి పరిధిలోని తొమ్మిది వసతి గృహాలకు చెందిన 140 మంది విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. ఏఎస్‌డబ్ల్యూఓ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం పీడీ జ్యోతిలక్ష్మి దేవి మాట్లాడుతూ పరీక్షల్లో మెళకువలు, మోడల్ పేపర్లకు అన్సర్ చేయడం, సమయపాలనపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు నాగరాజు, నాగేంద్రకుమార్, హనుమంతరావు, ఎం.శ్రీను, ఆనందకుమార్ విద్యార్థులకు పలు సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. హెచ్ఎంలు సుభాషిణి, సరస్వతి, రామచంద్రాపురం, అమలాపురం ఏఎస్‌డబ్ల్యూఓలు ఎస్.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, వసతి గృహాధికారులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన



జీజీహెచ్ వద్ద ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

యానాం: గత 44 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలంటూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది గురువారం రెండోరోజు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా స్థానిక జీజీహెచ్ ఆవరణలో నిరసనకారులు మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు జీతాలు ఇవ్వడం లేదని, ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకారులకు సంఘీభావం తెలిపిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నేత మల్లాడి సత్తిబాబు సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ



ఆడుదాం ఆంధ్రా కిట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ఆయా వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చేయాలని వార్డు సచివాలయాల కార్యదర్శులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి రెండో విడత కిట్లు, టీ షర్టులు, టోపీలను కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో కలిసి వార్డు సచివాలయ కార్యదర్శులకు పంపిణీ చేశారు. 15 ఏళ్ల పైబడిన వారంతా క్రీడలు ఆడేలా ప్రోత్సహించాలని వారు సూచించారు.

అంధురాలైనా అవార్డు సాధించడం అభినందనీయం



మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజేశ్వరిని సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన పుత్సా రాజేశ్వరి ప్రమాదవశాత్తు కంటి చూపును కోల్పోయినా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా క్లబ్‌ను అభివృద్ధి ప్రథంలో నడిపించి అవార్డు సాధించడం అభినందనీయమని వాకర్స్ ఎలెక్ట్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల అంతర్జాతీయ వాకర్స్ సంస్థ ఉత్తమ మహిళా వాకర్స్ క్లబ్ అవార్డు అందుకున్న రాజేశ్వరికి గురువారం స్థానిక కూచిమంచి అగ్రహారంలో అభినందన సభ ఏర్పాటుచేసిన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వలవల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దివ్యాంగులు

యానాం: బ్రెయిలీ లిపిని ఆవిష్కరించి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులని స్థానిక ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ దివ్యాంగ పాఠశాల ఇన్‌చార్జి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో బ్రెయిలీ 215వ జయంతిని పురస్కరించుకుని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ బాల్యంలోనే కంటిచూపు కోల్పోయినా నిరాశ చెందక బ్రెయిలీ లిపిని తయారుచేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయకుమారి, మహేశ్వరి, సుశీల, తాతారావు పాల్గొన్నారు.


వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

యానాం: పట్టణంలోని భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా 19వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు, పెద్దింటి లక్ష్మణాచార్యులు మూలవిరాట్‌కు, అమ్మవారికి, ఆంజనేయస్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. త్రిపాల శంకర్ దంపతులచే అభిషేకాలు నిర్వహించారు.

17 మందిపై బైండోవర్ కేసులు



బైండోవర్ చేసిన నిందితులతో ఎస్ఈబీ పోలీసులు

తాళ్లరేవు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, నాటు సారా కేసుల్లో నిందితులైన 17 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ జెవీ భవానీ గురువారం తెలిపారు. ఈ మేరకు 17 మందిని తహసీల్దార్ ఎస్.పోతురాజు వద్ద బైండోవర్ చేశామన్నారు. ఈ బైండోవర్‌ను అతిక్రమించి సారా, మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంవీబీ కుమార్ పాల్గొన్నారు.